## బహుమతి పొందిన చిట్టికథ

# కాంప్లెక్స్

— 'ప్రశాంతి'

ఎదురింట్లో ఎవరో భార్యాభర్తలు కొత్తగావచ్చి దిగారు. సుమకి వాళ్ళతో పరిచయం చేసుకోవాలని తహతహ. ఆమెకి అదొక అలవాటు. ఆ యింటి ఆవిడ తనకన్నా అందంగా ఉంటుందో, ఎలా ఉంటుందో! తనకన్నా ఎక్కువ చదువుకుందో, తక్కువ చదువు కుందో!

సుమ గేట్ తీసి ఎదురింట్లోకి అడుగు పెట్టింది. వాళ్ళ పెంపుడు కుక్క 'భౌ, భౌ' అంటూ అరిచింది. సుమ అడుగులు ముందుకు పడలేదు.

ఇంతలో యింటిఆవిడ సుమని చూసి నవ్వుతూ 'రండి' అని సాదరంగా ఆహ్వానించింది కుక్కని అదిలించి. సుమ కూడా నవ్వుతూ ఆమె వెనక లోపలికి నడిచింది. సామానంతా యింటినిండా చిందరవందర గా ఉంది.

"కూర్చోండి. సామానింకా సర్దుకోలేదండీ!" ఆవిడ సంజాయిషీ యిచ్చుకుంది.

"మీ పనికి ఆటంకమేమో నారాక" కూర్చుంటూ అంది సుమ.

"అబ్బే! అదేంలేదండి. మీరు రావడమే నాకు సంతోషం. కొత్తచోటు గదా! ఎవరితో ఎలా పరిచయం చేసుకోవాలా అని నాకుంటుంది. మా అంతట మీరు రావడం నాకు చాలా ఆనందంగా ఉంది. స్నేహం అంటే నాకు చాలా ప్రీతి" ఆవిడ గడగడా చెప్పింది.

"మీ పేరేమిటండీ!"

"సుమ"

"చాలా బాగుందండీ మీ పేరు"

తనని ఎవరైనా పొగిడారంటే సుమ చాలా పొంగిపో తుంది.

"మీ పేరేమిటి?" సుమ తిరిగి ప్రశ్నించింది.

"కౌసల్య!"

'పాతకాలం పేరు' అని సుమ మనసులోనే అను కుంది.

"మీరేం చదివారు?" కౌసల్య అడిగింది.

సుమ ముఖం చిన్నబోయింది. "ఇంటర్ చదివా నండీ! అంతే! చెప్పుకోడానికే బాధగా ఉంటుంది."

"ఇది మరీ బాగుందండి. బాధ ఎందుకు? ఎంతవ రకు ప్రాప్తమో అంతవరకే. అందరు ఆడవాళ్ళకీ డిగ్రీ లుంటాయంటారా?" కౌసల్య నవ్వుతూ అంది.

"మీరేం చదివారు?"

"మీ అత్తవారి ఊరు ఏదండీ?" సుమ ప్రశ్నకి సమాధానం చెప్పకుండా ఎదురుప్రశ్న వేసింది కౌసల్య.

"విజయవాడండీ. మీరేం చదివారు?" ఆత్రంగా మళ్ళీ అడిగింది సుమ.

"మీ వారేం చేస్తుంటారు?"

'ఇదేమిటి?. ఈవిడ నా ప్రశ్నలకి సమాధానం చెప్ప కుండా తిరిగి ప్రశ్నిస్తుందేమిటి' అనుకుంది.

"స్టేట్ బ్యాంకులో ఆఫీసరండి. మీరేం చదివారు?"

"మావారూ బ్యాంకు ఆఫీసరే! అయితే బ్యాంకు తేడా అనుకోండి. ఆయన ఆంధ్రా బ్యాంకులో చేస్తున్నారు."

ఇదేమిటి? ఈవిడ తనకి కావలసిన సమాధానం చెప్పకుండా మాట మారుస్తుందేమిటి? అనుకుంది సుమ. ఆమె మనసుకి ఒక ఆలోచన కలిగింది. ఓహో! అందుకు కాబోలు ఈవిడ మాట మారుస్తూంది అసలు సంగతి చెప్పకుండా!

"ఉండండి. కొంచెం కాఫీ తెస్తాను."

"వద్దండీ యిప్పుడు."

"ఫరవాలేదు. కొత్తగా వచ్చిన మాకు మీరు మొదటి అతిథి!" నవ్వుతూ కౌసల్య లోపలికి వెళ్ళి బిస్కెట్స్ కాఫీ తీసికొచ్చింది. సుమ వెళ్లేముందు పండు, తాంబూలం తెచ్చి ఆమెకు బొట్టుపెట్టి యిచ్చింది. నవ్వుతూ సంతో షంగా గేటు వరకూ సాగనంపింది కౌసల్య.

* * *

ఆ రాత్రి భర్తతో చెప్పింది.

"ఏమండీ! ఎదురింట్లోకి కొత్తగా వచ్చారే! ఆవిడతో పరిచయం చేసుకున్నానండీ"



'ఊ!' అన్నాడు ప్రకాష్ యదాలాపంగా.

"ఆవిడకి చదువు బొత్తిగా తక్కువనుకుంటానండీ. ఏడో, ఎనిమిదో చదివి ఉరేటుంది"

"నీకెలా తెలుసు? ఎక్కువే చదువుకుందేమో!"

"నేను మూడుసార్లు అడిగినా ఏం చదివిందో చెప్ప కుండా మాట మార్చేసింది. ఎక్కువ చదివితే గర్వంగా చెప్పుకునేదేగా!"

"ఎక్కువ చదివితే గర్వపడాలని రూలుందా? అందరూ నీలాంటి గర్వపోతులుంటారా?" హాస్యమాడా డు ప్రకాష్.

"నేను గర్వపోతునా? మీరలాగే అంటారు గాని నేను ఇంటర్ చదివానని బాధగా అంటే ఆవిడ ఏమందో తెలుసా! "ఎందుకు బాధపడాలి. ఎంతవరకు ప్రాప్తమో అంతవరకే అందికూడా."

"పోనీలే! మనకెందుకు ఒకరి గొడవ?" అతనికి వినుగ్గా ఉంది.

"నా పేరు ఆవిడకి చాలా బాగుందట."

"అవును మరి! నీలాగా నీ పేరు అందమైనదే గదా!"

మురిసిపోయింది సుమ.

"ఆవిడ పేరు మరీ పాతపేరు... కౌసల్య!"

"పాతపేరు అయితేనేం? రఘురాముని కన్న పుణ్య మాత ఆ కౌసల్య."

"ఎంతయినా పాతపేరే గదా!"

"ఊ! సరేలే! ఆవిడ నీకన్నా తక్కువ చదివింది. పాతపేరు గలది. ఇంక నీకు సంతోషంగా ఉందా? ఇంక పడుకో. అట్టే విసిగించకు నన్ను" కసురుకున్నాడు ప్రకాష్.

"హూ! ఎప్పుడూ విసుగే!" మూతి తిప్పుకుంది సుమ.

* * *

రెండు రోజుల తరువాత—ప్రకాష్ ఆఫీసుకు వెళ్తూ—ఎదురింటివైపు ఓ సారి చూసి, సుమను పిలిచి 'అటుచూడు' అన్నాడు. ఎదురుగా గేట్‌కి తగిలించిఉ న్న నేమ్ ప్లేట్ మీద 'డా।ఎస్.కౌసల్యాదేవి, ఎం.బి.బి.యస్.' అని వుంది. అది చూసిన సుమకు నోట మాట రాలేదు.

"ఆ! చూశావా! ఆవిడ మూడుసార్లు నువ్వడిగినా ఏం చదువుకుందో చెప్పకుండా ఎందుకు మాట మార్చిందో తెలిసిందా? నువ్వు తనకన్న తక్కువ చదివానని బాధ పడతావని. అర్థమవుతూంది గదా! ఇప్పుడు దాన్నిబట్టి ఆవిడ ఎంత సంస్కారవంతురాలో ఆలోచించుకో! ఆ సంస్కారమే కనిపించని అందం. వస్తా!" స్కూటర్ స్టార్ట్ చేశాడు ప్రకాష్. తెల్లమొహం వేసుకుని లోపలికి వచ్చింది సుమ. □